
ఆత్మకూరు : మత్తడి పోస్తున్న కటాక్షపురం పెద్ద చెరువు


హనుమకొండ సబ్‌అర్బన్ : ఎల్కతుర్తిలో మునిగిపోయిన మిర్చి పంట


దామెర : ఊరుగొండ-పసరగొండ రోడ్డును మూసిన అధికారులు


ఎల్కతుర్తి : కోతులనడుమ గ్రామంలో హైవేపై పడిన చెట్టు


ఐనవోలు : మండలకేంద్రంలో రోడ్డు పైనుంచి ప్రవహిస్తున్న నీరు

# జడి వాన


కాజీపేట : డీజిల్ కాలనీలో రోడ్డుపై నిలిచిపోయిన వర్షం నీరు

- జిల్లాను ముంచెత్తిన భారీ వర్షం
- నీట మునిగిన పంట పొలాలు
- నిండుతున్న జలాశయాలు
- వరంగల్ నగరం అతలాకుతలం
- లోతట్టు ప్రాంతాలు, రోడ్లు జలమయం
- స్తంభించిన రాకపోకలు
- వరద సహాయక చర్యల్లో గ్రేటర్ సిబ్బంది
- రంగంలోకి దిగిన డీఆర్‌ఎఫ్ బృందాలు
- ముంపు ప్రాంతాల్లో ప్రజాప్రతినిధులు, అధికారుల పర్యటన
- 25 పునరావాస కేంద్రాల ఏర్పాటుకు చర్యలు, ఆరు ప్రారంభం
- గ్రామీణ ప్రాంతాల్లో గంటల తరబడి విద్యుత్ అంతరాయం

నమస్తే నెట్‌వర్క్, సెప్టెంబర్ 1 : బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో జిల్లాలో వాన దంచి కొట్టింది. వేలేరు మండలంలో అత్యధికంగా 105.5 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. కుంటలు, చిన్న చెరువులు పూర్తిస్థాయిలో నిండి అలుగులు పోస్తుండగా, పెద్ద చెరువుల్లోకి భారీ ఎత్తున నీరు చేరుతున్నది. బ్రిడ్జిలు, కాలువలు నిండిపోయి రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. పలు చెరువులు మత్తడి పోస్తున్నాయి. భారీ వర్షాలకు నగరం జలమయమైంది. హనుమకొండ కొత్తబస్టేషన్ రోడ్, హనుమకొండలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణ, బస్‌స్టేషన్, చౌరస్తా, శ్రీదేవి ఏషియన్‌మాల్‌రోడ్, పెద్దమ్మగడ్డ, ములుగు రోడ్ జంక్షన్, అంబేద్కర్ కూడలి, డీఈవో ఆఫీస్ ఆవరణ నీట మునిగింది. వరంగల్, హనుమకొండ ప్రాంతాల్లోని ప్రధాన చెరువులైన భద్రకాళీ, వడ్డేపల్లి, చిన్న వడ్డేపల్లి, ఉర్సు చెరువులు అలుగు పారాయి. హంటర్‌రోడ్, నందిహిల్స్‌కాలనీ, దీన్‌దయాల్‌కాలనీ, సుర్జీత్‌నగర్ కాలనీలు నీటమునిగాయి. హంటర్‌రోడ్డు, నయీంనగర్, ములుగు రోడ్డు, హనుమకొండ బస్‌స్టేషన్, విజయ టాకీస్ రోడ్డు, వరంగల్ చౌరస్తా, స్టేషన్ రోడ్లపైకి వరద నీరు పోటెత్తడంతో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. బల్దియా ఆధ్వర్యంలో సుమారు వెయ్యి మంది ముమ్మరంగా సహాయక చర్యలు చేపట్టారు. వరద నీటిలో పూర్తిగా మునిగిపోయిన ఎన్‌టీఆర్‌నగర్, సాయినగర్, బృందావన్‌కాలనీ, బీఆర్ నగర్, రాజీవ్ కాలనీ, మైసయ్య నగర్, డీకే నగర్, బీఆర్ నగర్, ఇందిరమ్మకాలనీ, ఆకారపు వీరలక్ష్మి కాలనీ, గరీబ్ నగర్, ఎస్సార్ నగర్, మధురానగర్, సాయిగణేశ్ నగర్, లక్ష్మీగణపతి కాలనీ, ఎంహెచ్ నగర్‌లలో చిక్కుకున్న ప్రజలను డీఆర్‌ఎఫ్ బృందాలు, ఫైర్ సిబ్బంది ట్రాక్టర్లు, జేసీబీల సహాయంతో సురక్షిత ప్రాంతాలకు తరలించారు. నగరంలో 25 పునరావాస కేంద్రాల ఏర్పాటుకు అధికారులు చర్యలు చేపట్టారు. మొదటి రోజు 6 కేంద్రాలను ప్రారంభించి సుమారు 500 మందిని తరలించారు. పోతన బైపాస్ రోడ్డులోని మార్వాడీ సమాజ్ భవన్, కరీమాబాద్ బీరన్నకుంట ప్రభుత్వ పాఠశాల, శివనగర్ కార్మిక పరపతి సంఘం, ఏజీఆర్ గార్డెన్స్, శుభం గార్డెన్స్, కాశీకుంట చర్చిలో ఆశ్రయం కల్పించారు. రామన్నపేట, మైసయ్యనగర్, రఘునాథ్‌కాలనీల నుంచి బయటికి రాలేని ప్రజలకు బల్దియా సిబ్బంది భోజన ప్యాకెట్లను అందజేస్తున్నారు. బల్దియా ప్రధాన కార్యాలయంలో 24 గంటలు కంట్రోల్ రూమ్ పనిచేస్తోంది. జిల్లాలో 2.60 లక్ష ల ఎకరాల్లో వానకాలం సాగు అంచనా ఉండగా, ఇందులో సగం మండలాల్లో వరి నాట్లు పూర్తయ్యి కలుపు దశలో ఉన్నాయి. పరకాల డివిజన్ పరిధిలో మాత్రం నాటు దశలోనే ఉన్నాయి. ప్రస్తుతం కురిసిన వర్షాలతో కొన్ని ప్రాంతాల్లో పంటలు నీట మునిగాయి. గ్రామీణ ప్రాంతాల్లో గంటల తరబడి విద్యుత్ సరాఫరా నిలిచిపోయింది. గత ప్రభుత్వ హయాంలో ఇలాంటి తుఫాన్ వచ్చినా విద్యుత్ సరాఫరాకు అంతరాయాలు కలుగలేదు. ఇప్పుడు మాత్రం సాధారణ వర్షానికే పది, ఇరవైసార్లు అంతరాయా లు ఏర్పడడంపై పలువురు నిరసన వ్యక్తం చేస్తున్నారు. ఆత్మకూరు మండలంలోని నీరుకుళ్ల చలివాగు, జెర్రిపోతుల వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. జాతీయ రహదారిపైన ఉన్న కటాక్షపురం పెద్ద చెరువు మత్తడి ఉధృతి పెరగడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. హనుమకొండ, ములుగు, ఏటూరునాగారం, మంగపేట వైపు వెళ్లే వాహనాలను పోలీసులు దారి మళ్లించా రు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సీఐ సంతోశ్‌కుమార్ సూచించారు. అక్కంపేటలో 30 ఎకరాల్లో మక్కజొన్న పంటలు నేల మట్టమయ్యాయి. దామెర మండలంలో ఊరుగొండ-పసరగొండ క్రాస్ రోడ్డులోని లోలెవల్ బ్రిడ్జి వద్ద వరద ఎక్కువగా ఉండడంతో అధికారులు ముళ్లకంచెలు వేసి మూసివేశారు. తహసీల్దార్ జ్యోతివరలక్ష్మీదేవి ఊరుగొండ పెద్ద చెరువు కట్టను పరిశీలించారు. ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి, ఎస్సై అశోక్ శిథిలావస్థలో ఉన్న ఇండ్లల్లో ప్రజలు ఉండొద్దని సూచించారు. కోగిల్వాయి, వెంకటాపురం, పసరగొండ, ల్యాదెళ్ల, పులుకుర్తిలోని చెరువులు, కుంటలు మత్తళ్లు పో స్తుండగా పులుకుర్తి గ్రామ సమీపంలోని లోలెవల్ బ్రిడ్జిపై నుండి వరదన నీరు వెళ్తోంది. శాయంపేట మండలంలోని జోగంపల్లి శివారులోని చలివాగు జలాశయం మత్తడి పోస్తోంది. దీంతో లోతట్టు ప్రాంతాలు జలయమయ్యాయి. పత్తి, పసుపు, మిర్చి తోటల్లో నీరు చేరింది. మండలంలోని మాందారి పేట, సూరంపేట కాజువేపై వరద ప్రవహిస్తోంది. మైలారం, గట్ల కనపర్తి తదితర గ్రామా ల్లో పలు కాలనీల్లోకి వరద చేరింది. ఎల్కతుర్తి మండలంలోని ఎల్కతుర్తి సీతపతికుంట, చింతలపల్లి చెరువు, పెంచికల్‌పేట ఊడుగుల కుంటలు మత్తడి పోస్తున్నాయి. ఎల్కతుర్తి, కోతులనడుమ వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. ఇందిరానగర్‌లోని అంబాల మొగిలి ఇల్లు వర్షానికి నేలమట్టమైంది. కమలాపూర్ పెద్ద చెరువు జలకళ సంతరించుకుంది. ఉప్పల్, గూడూరు, శనిగరం, మర్రిపల్లిగూడెం, వంగపల్లి, అంబాల గ్రామాల్లో వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. ఉప్పల్ పెద్ద చెరువు మత్తడి దూకుతోంది. ధర్మసాగర్ మండలంలోని శాయిపేట వద్ద వాగు పొంగడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. వేలేరు మండలంలోని మద్దెలవాగు, ఎల్లమ్మ వాగు, కన్నారం, పీచర శివారు మంచినీళ్ల వాగు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. వేలేరు నుండి కొత్తకొండకు వెళ్లే ప్రధాన రహదారిలో ఉన్న ఎల్లమ్మ వాగు ఉధృతంగా ప్రవహించడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. కాజీపేట పట్టణంలోని లోతట్టు ప్రాంతాలైన జూబ్లీమార్కెట్, డీజిల్ కాలనీ, బాపూజీనగర్, ఇంపీరియల్ కాలనీ, బూడిదగడ్డ, విష్ణుపురి మహంకాళీ దేవాలయ ప్రాంతాలు జలాశయాలను తలపించాయి. ఇండ్లలోకి వర్షం నీరు చేరడంతో కుటుంబ సభ్యులు తోడి బయట పోస్తున్నారు. కాజీపేట రైల్వే జంక్షన్ మొత్తం వర్షం నీటితో నిండిపోయింది. పోచమ్మ పండుగను చేసుకునే ప్రజలు వర్షంతో తీవ్ర ఇబ్బంది పడ్డారు. వర్షాలతో పరకాల పట్టణం జలమయమైంది. శ్రీనివాస కాలనీ, మాదారం కాలనీ, రాజీపేటలోనికి వరద నీరు చేరడంతో ప్రజలు ఇండ్లకే పరిమితమయ్యారు. భూపాలపల్లి రోడ్డుపై పెద్ద ఎత్తున వరద నీరు చేరడంతో ప్రయాణికులు, వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. ప్రజలు అత్యవసరమైతే తప్ప బయటికి రావొద్దని మున్సిపల్ చైర్‌పర్సన్ సోదా అనిత రామకృష్ణ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఐనవోలులోని ఒంటిమామిడిపల్లి ఎల్లమ్మ చెరువు, ఐనవోలు ఊరు చెరువు మత్తడి పోస్తున్నాయి. పత్తి, మక్కజొన్న పంటల్లో నీరు చేరింది. పంథినిలోని జాతీయ రహదారిపై ఉధృతి పెరుగడంతో ఎస్సై శ్రీనివాస్ ఆధ్వర్యంలో పోలీసులు సహాయక చర్యలు చేపట్టి వాహనదారులను రోడ్డు దాటించారు.


వరంగల్ : ఎంపీ కడియం కావ్యతో కలిసి ముంపు ప్రాంతాలను పర్యటిస్తున్న గ్రేటర్ కమిషనర్ అశ్వినీ తానాజీ వాకడే

## ముంపు ప్రాంతాల్లో ప్రజాప్రతినిధులు, అధికారుల పర్యటన

వరంగల్ : నగరంలోని ముంపు ప్రాంతాల్లో మేయర్ గుండు సుధారాణి, వరంగల్ ఎంపీ కడియం కావ్య, మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావు, వరంగల్, హనుమకొండ జిల్లాల కలెక్టర్లు సత్యశారద, ప్రావీణ్య, గ్రేర్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే పర్యటించారు. ఎన్‌టీఆర్ నగర్, బృందావన్‌కాలనీ, సాయినగర్ కాలనీ, పోతన నగర్‌లో పరిస్థితిని అంచనా వేశారు. వరద సహాయక చర్యలను పరిశీలించారు. పునరావాస కేంద్రాలను సందర్శించి వరద బాధితులకు ధైర్యం చెప్పారు. అధికారులు అందుబాటులో ఉంటూ సహాయక చర్యల్లో పాలుపంచుకుంటున్నారని, వరద అంచనాలను దృష్టిలో ఉంచుకొని ప్రత్యేక చర్యలు చేపడుతామన్నారు. తాగునీరు, భోజనంతో పాటు కేంద్రాల్లో అన్ని వసతులు కల్పించాలని అధికారులను ఆదేశించారు.


వరంగల్ : ముంపు ప్రాంతాల్లో పర్యటిస్తున్న మేయర్ గుండు సుధారాణి, మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావు, అధికారులు

## అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఏర్పాట్లు

### మంత్రి సీతక్క.. కటాక్షపురం పెద్ద చెరువు మత్తడి పరిశీలన

ఆత్మకూరు : భారీ వర్షాల నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని మంత్రి సీతక్క ఆదేశించారు. ఆదివారం మండలంలోని కటాక్షపురం పెద్ద చెరువు మత్తడి పోస్తుండగా మంత్రి సీతక్క సంబంధిత అధికారులతో మాట్లాడి వివరాలను తెలుసుకున్నారు. అధికారులు మత్తడి పరిస్థితిని ఎప్పటికప్పుడు తెలపాలన్నారు. ముంపు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. తహసీల్దార్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి, సీఐ సంతోశ్‌కుమార్, ఎస్సై పరమేశ్వర్ ఉన్నారు. కాగా, కటాక్షపురం పెద్ద చెరువు మత్తడి పోస్తుండడంతో ములుగు, హనుమకొండ వెళ్లే ప్రధాన రహదారిపై రాకపోకలు నిలిచిపోయాయి. ఈ క్రమంలో పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి చెరువు మత్తడిని పరిశీలించారు. చెరువు మత్తడి ప్రవాహం మరింత పెరిగే అవకాశం ఉన్నందున ఎలాంటి నష్టం జరుగకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలని రెవెన్యూ, ఇరిగేషన్, పోలీస్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.


అధికారులతో మాట్లాడుతున్న మంత్రి సీతక్క

## నేడు విద్యా సంస్థలకు సెలవు

హనుమకొండ చౌరస్తా, సెప్టెంబర్ 1 : భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో జిల్లాలోని అన్ని విద్యాసంస్థలకు సోమవారం సెలవు ప్రకటిస్తున్నట్లు కలెక్టర్ ప్రావీణ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 14న సెలవు దినం కాగా, ఆ రోజు అన్ని విద్యాసంస్థలు పనిచేస్తాయని చెప్పారు. అలాగే కేయూ పరిధిలోని అన్ని కాలేజీలకు సెలవు ప్రకటిస్తున్నట్లు రిజిస్ట్రార్ మల్లారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

**కేయూ డిగ్రీ, పీజీ పరీక్షలు వాయిదా..**

హనుమకొండ చౌరస్తా : కేయూ పరిధిలో సోమవారం జరగాల్సిన అన్ని డిగ్రీ, పీజీ పరీక్షలను వాయిదా వేస్తున్నట్లు పరీక్షల నియంత్రణాధికారి నరసింహాచారి ఒక ప్రకటనలో తెలిపారు. మిగిలిన పరీక్షలు యథావిధిగా జరుగుతాయన్నారు.

## నేటి ప్రజావాణి రద్దు

హనుమకొండ చౌరస్తా, సెప్టెంబర్ 1 : కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు కలెక్టర్ ప్రావీణ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. భారీ వర్షాలు కురుస్తుండగా వివిధ శాఖల అధికారులు సహాయక చర్యల్లో నిమగ్నమై ఉన్నందున గ్రీవెన్స్‌ను రద్దు చేసినట్లు పేర్కొన్నారు. వచ్చే సోమవారం యథావిధిగా ప్రజావాణి కొనసాగుతుందని తెలిపారు.

**బల్దియా గ్రీవెన్స్..**

వరంగల్ : బల్దియా గ్రీవెన్స్‌ను రద్దు చేస్తున్నట్లు గ్రేటర్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు గమనించి కార్యాలయానికి రావొద్దని కోరారు.





వేలేరు : పొంగిపొర్లుతున్న వేలేరు మద్దెలవాగు


న్యూశాయంపేట : హంటర్‌రోడ్డులో ప్రవహిస్తున్న వర్షపు నీరు


పరకాల : పట్టణంలో జలమయమైన ప్రధాన రహదారి

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

**సెప్టిక్ ట్యాంక్ క్లినర్**

★ సెప్టిక్ ట్యాంక్ క్లినర్ నూతన సాంకేతిక పరిజ్ఞానంతో గల్పర్ మిషన్ ద్వారా సెప్టిక్ ట్యాంక్ క్లీన్ చేయబడును. డి.ఎస్. రావు. Cont: 9849145043, 9866584455.
NTW-318996

**BUSINESS OFFER**

★చాలా పెద్ద చదువులు చదువుకున్న నిరుద్యోగ యువతీ, యువకులకు సువర్ణావకాశం. అతి తక్కువ పెట్టుబడితో ప్రతి నెల అత్యధికంగా సంపాదించుకునే సువర్ణావకాశం. సంప్ర: సెల్: 9502940056.
NTW-326315

**WANTED HOSPITAL STAFF**

★Pharmacy Boys, Operation Theater Boys & Receptionist / సిస్టమ్ ఆపరేటర్స్ కావలెను. సంప్ర: గార్డియన్ హాస్పిటల్, ములుగు 'X' రోడ్, వరంగల్. 12 to 2 PM.
NTW-0418

**గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ ప్రకటన కేవలం 200/- మాత్రమే
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ 4 ప్రకటనలకు కేవలం 600/- మాత్రమే
ప్రతి అదనపు లైన్‌కు 50/- మాత్రమే
ప్రకటనల విభాగం : 9182777552
HANAMKONDA 9182777563 9182777618
WARANAGAL 9182777556
JAYASHANKAR BHUPALPALLY - 9182777559
MULUGU - 9182777135
MAHABUBABAD - 9182777557
JANGAON - 9182777565

## రెండు రోజులు నిరంతర వైద్య సేవలు

వరంగల్, సెప్టెంబర్ 1 : రెండు రోజులు నిరంతర సేవలు అందించేందుకు చర్యలు చేపట్టినట్లు డీఎంహెచ్‌వో లలితాదేవి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. భారీ వర్షాలు కురుస్తున్న కారణంగా వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు, సిబ్బంది నిరంతరం అందుబాటులో ఉండాలన్నారు.

## చేపల వేటకు వెళ్లి మత్స్యకారుడి మృతి


రాములు(ఫైల్)

పరకాల, సెప్టెంబర్ 1 : చేపల వేటకు వెళ్లి మత్స్యకారుడు మృతిచెందిన ఘటన ఆదివారం జరిగింది. స్థానికులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. రాజీపేట గ్రామానికి చెందిన గువ్వ రాములు (58) శుక్రవారం సాయంత్రం చేపల వేటకు వెళ్లి గల్లంతయ్యాడు. శనివారం వెతికినా దొరకలేదు. ఆదివారం డ్రోన్ సహాయంతో వెతకగా పరకాల చెరువు శివారులో రాములు మృతదేహం కన్పించింది. కాగా, చేపల వేటకు వెళ్లిన మత్స్యకారుడు మృతి చెందడంతో రాజీపేట గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

## బెట్టింగ్ నిర్వాహకుడిపై కేసు

నయీంనగర్ : క్రికెట్ బెట్టింగ్ నిర్వాహకుడిపై కేయూసీ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. గోపాలపురంలో అక్రమంగా జనగాని సురేశ్ ఆన్‌లైన్‌లో సట్టా, మట్కా నిర్వహిస్తున్నాడనే సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్ సిబ్బంది కేయూ సీ పోలీసులతో కలిసి దాడి చేసి పట్టుకున్నారు. దినసరి కులీలు, ఆటో డ్రైవర్లు, చిరు వ్యాపారాలను ఎక్కువ డబ్బులు సంపాదించొచ్చని మోసం చేస్తూ, వారి నుంచి డబ్బులు తీసుకుని కమీషన్ ఏజెంట్‌గా వ్యవహరిస్తున్నాడని తెలిపారు. ఇన్‌స్పెక్టర్ పవన్‌కుమార్, టాస్క్‌ఫోర్స్, కేయూసీ పోలీసులు పాల్గొన్నారు.

## కాజీపేటలో టీచర్స్‌డే

కాజీపేట : చిన్నారును ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దేది ఉపాధ్యాయులేనని ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. 62వ డివిజన్‌లోని సీఎస్ఐ చర్చి ఆధ్వర్యంలో ఆదివారం టీచర్స్ డే నిర్వహించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు జక్కుల రవీందర్ యాదవ్, విజయశ్రీ రజాలీ, మాజీ కార్పొరేటర్ గోల్కొండ రాంబాబు పాల్గొన్నారు.

# ముంపు నివారణకు చర్యలు చేపట్టండి

### కలెక్టర్ ప్రావీణ్య

హనుమకొండ చౌరస్తా, సెప్టెంబర్ 1 : భారీ వర్షాల నేపథ్యంలో సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది వరద ముంపు నివారణకు సత్వర చర్యలు చేపట్టాలని కలెక్టర్ ప్రావీణ్య ఆదేశించారు. ఆదివారం వరంగల్ పోతన నగర్ సమీపంలోని భద్రకాళీ చెరువు కట్ట ప్రాంతాన్ని అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రమాదం జరగక ముందే చెరువు కట్ట వద్ద ఇసుక బస్తాలతో నివారణ చర్యలు చేపట్టాలని సాగు నీటి పారుదల శాఖ అధికారులకు ఆదేశించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించాలన్నారు. వరద పరిస్థితులపై ఎప్పటికప్పుడు తనకు సమాచారం అందించాలని సూచించారు. ఆమె వెంట హనుమకొండ ఆర్డీవో వెంకటేశ్, సాగు నీటిపారుదల శాఖ డీఈ హర్షవర్ధన్ తదితరులు ఉన్నారు.

**వీసీలో పాల్గొన్న కలెక్టర్, గ్రేటర్ కమిషనర్**

భారీ వర్షాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని సూచిస్తూ హైదరాబాద్ నుంచి ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సీఎస్ శాంతికుమారి ఆదివారం కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. హనుమకొండ నుంచి కలెక్టర్ ప్రావీణ్య, గ్రేటర్ కమిషనర్ అశ్వనీ తానాజీ వాకడే, అదనపు కలెక్టర్ వెంకటరెడ్డి పాల్గొన్నారు.



పోతననగర్ సమీపంలోని భద్రకాళి చెరువుకట్టను పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రావీణ్య

## వీడియో జర్నలిస్టు పై దాడి

కాజీపేట, సెప్టెంబర్ 1 : విష్ణుపురి మహంకాళీ అమ్మవారి దేవాలయ సమీపంలో అత్తవారింటికి వెళ్తున్న ఓ మీడియా చానల్ కెమెరామెన్‌పై యువకులు ఆదివారం రాత్రి దాడి చేశారు. బాధితుడు దశరథం కథనం ప్రకారం.. కార్యాలయంలో విధులు ముగించుకుని కాజీపేటకు చేరుకున్నాను. మహంకాళీ ఆలయ సమీపంలో మద్యం తాగి ఉన్న యువకులు ద్విచక్ర వాహనాన్ని అడ్డుకుని గొడవకు దిగారు. తాను ఓ చానల్ కెమెరామెన్‌గా పని చేస్తానని చెబుతున్నా వినిపించుకోకుండా దాడి చేశారని తెలిపాడు. బాధితుడు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

# 33 ఏళ్లకు మురిపంగా కలుసుకున్నారు

శాయంపేట, సెప్టెంబర్ 1 : శాయంపేట జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1990-91 సంవత్సరంలో పదో తరగతి చదివిన వారు 33 ఏళ్ల తర్వాత ఆదివారం ఎస్ వీకేకే ఫంక్షన్ హాల్‌లో పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఘనంగా నిర్వహించుకున్నారు. తమతో పాటు చదువుకున్న విద్యార్థులు, విద్యాబుద్ధులు నేర్పి మరణించిన గురువులను గుర్తు చేసుకుంటూ రెండు నిమిషాలు మౌనం పాటించి శ్రద్ధాంజలి ఘటించారు. ఆనాటి ఉపాధ్యాయులు రవ్వ అంజయ్య, జిల్లెల్ల జనార్దన్‌రెడ్డి, కల్లెడ రఘుపతిరెడ్డి, వనం సదానందం, పార్వతీదేవి, యతిపతి సత్యనారాయణ, వెల్దండి సుదర్శన్, బక్కి సదానందరావు, చంద్రమౌళి, సముద్రాల భాషాచార్యులు, కాయిత శ్రీనివాస్‌ను సత్కరించారు. కార్యక్రమంలో నిర్వహణ కమిటీ కన్వీనర్ శాగంటి స్వామి, కో కన్వీనర్స్ బాసాని విద్యాసాగర్, కాళేశ్వరపు ఇందిర, కోశాధికారులు వైనాల కుమారస్వామి, చిట్టిరెడ్డి మంజుల, కోఆర్డినేటర్ కందగట్ల గణేశ్, కూరాకుల రవి, కోమటి శేఖర్, సామల సూర్యప్రకాశ్ పాల్గొన్నారు.


సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు


కాజీపేటలో ప్రయాణికులకు ఆహారం అందిస్తున్న మంత్రి పొన్నం

## కాజీపేటలో రైలు ప్రయాణికులతో మంత్రి పొన్నం, కలెక్టర్ మాటామంతీ

కాజీపేట, సెప్టెంబర్ 1 : కాజీపేట రైల్వే జంక్షన్‌లో ఆదివారం రాత్రి సంఘమిత్ర రైలు ప్రయాణికులను కలెక్టర్ ప్రావీణ్య, మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి పరామర్శించారు. బెంగళూరు- దానాపూర్, దానాపూర్- బెంగళూరు మధ్య నడిచే సంఘమిత్ర రైళ్లను రైల్వే అధికారులు ఆదివారం తెల్లవారు జామున మహబూబాబాద్, కేసముద్రం రైల్వే స్టేషన్లలో నిలిపి వేశారు. వీరిని గమ్యం చేర్పించేందుకు కాజీపేట నుంచి దానాపూర్, బెంగళూరుకు రెండు ప్రత్యేక రైళ్లను ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో దాదాపు నాలుగు వేల మంది ప్రయాణికులను రైల్వే అధికారులు కాజీపేటకు ఆదివారం రాత్రి రోడ్డు మార్గంతో తరలించారు. రైల్వే మజ్దూర్ యూనియన్, కమర్షియల్ శాఖ ఆధ్వర్యంలో వారికి రైల్వే కమ్యూనిటీ హాల్‌లో వసతి, భోజనం ఏర్పాటు చేశారు. ఈ ప్రయాణికులను కలెక్టర్, మంత్రి, ఎమ్మెల్యే పరామర్శించి ఆహార పొట్లాలు, వాటర్ బాటిళ్లను పంపిణీ చేశారు.


గోకుల్‌నగర్‌లో లోతట్టు ప్రాంతాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

## లోతట్టు ప్రాంతాలను పరిశీలించిన ఎమ్మెల్యే నాయిని

హనుమకొండ చౌరస్తా, సెప్టెంబర్ 1 : ప్రజలు అత్యవసరమై తప్ప బయటకు రావొద్దని ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి సూచించారు. భారీ వర్షాల నేపథ్యంలో ఆదివారం హనుమకొండలోని పలు ప్రాంతాల్లో పర్యటించారు. నయీంనగర్ బ్రిడ్జి ప్రారంభం కాగానే గోకుల్‌నగర్, అంబేద్కర్‌నగర్, గాంధీనగర్‌లో నాలా పనులు మొదలు పెడుతామన్నారు. ఇప్పటికే రూ.5కోట్లపైగా నిధులతో జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీనివాస్‌రెడ్డి చేతుల మీదుగా శంకుస్థాపన చేశామని గుర్తుచేశారు. వచ్చే రెండు మూడు రోజులు ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ పునరావాస సహాయక చర్యల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు.